# దీపావళి

శ్రీ కొరటాల ప్రకాశరావు

అది ఒక చిన్న గ్రామం. ఊరికి పడమర ప్రక్క ఒక పూరిగుడిసె వుంది. ఆఒక్క పూరిగుడిసె తప్ప దాదాపుగా ఆవూరంతా ఇక పెంకుటిళ్లే. ఆసాములంతా కాస్తో కూస్తో వున్నవాళ్లే. ఊరికి ఒక మైలు దూరాన మాలపల్లివుంది. కోతలు మొదలైన పనులు వచ్చినప్పుడు మాలలందరూ వీరికి కూలికి వస్తూండే వాళ్లు. ఈరకంగా రోజులు గడచిపోతున్నాయ్. ఆ సంవత్సరము అంతవరకూ వర్షాలులేవు. పైరులేమీ బాగుండలేదు. కాపులందరు వర్షాలు కురువ వలసిందని దేవుళ్లకు నైవేద్యాలు పెట్టారు. కొలువులు కొలిశారు. కాని వర్షాలు కురువలేదు. మూఢ నమ్మకాలవల్ల కొలువులు కొలిస్తే వర్షాలు కురుస్తాయనుకున్నారు. కాని పాపం లాభం లేకపోయింది.

♦ ♦ ♦

ఆశ్వీజమాసం వచ్చింది. వరిపైరంతా యీనే రోజు లొచ్చాయ్. వర్షాలు లేకపోయినాగాని మా గాణి భూములు గనుక ఏదో ఒకమాదిరిగా వున్నాయి. కాస్త తెలిసిన పెద్దలంతా, "ఈసంవత్సరము యింత వరకు వర్షాలేమీ లేవు కాబట్టి యిక పూర్తిగా వర్షాలు కురుస్తాయి, పైరులన్నీ పాడైపోతాయని భయపడుతున్నారు. ఇక వర్షాలు కురిస్తే మనకు తింటానికి తిండి కూడా దొరకదని కొందరంటున్నారు. కొంతమంది, "ఈ నెలలో వర్షాలు కురిసేటట్లు పంచాంగాలల్లో వ్రాయలేదు కాబట్టి ఫరవాలేదను" కుంటున్నారు. ఈవిధంగా ఎవరి మనసుకు వచ్చినట్లు వారు అనుకుంటున్నారు. ముందు జరుగపోయేసంగతి వారికిమాత్రం ఏంతెలుస్తుంది పాపం!

ఊరికి పడమరగా నున్నటువంటి ఆచిన్నగుడిసె కోటయ్య అనేటటువంటి ఒక గొల్లవానిది. అది ఎండకు ఇల్లేగాని వానకుమాత్రం ఇల్లుకాదు. కొద్దిగా వర్షం కురిసిందీ అంటే ఇల్లంతా వానకురుస్తుంది. ఇల్లు పల్లం అవటంవల్ల నీళ్లు యింట్లోకి వస్తాయి. బీదవాడైనటువంటి కోటయ్య తనభార్య పిల్లలతో ఆకొంపలోనే కాపురం చేస్తున్నాడు. అతనికి ఆరుగురు మగపిల్లలు, ఇద్దరు ఆడపిల్లలు. అందరు పదహారు సంవత్సరముల వయస్సులోపువాళ్లే. భార్య మళ్లీ యిప్పుడు గర్భిణితో వుంది. దరిద్రుని పెండ్లికి వడగండ్ల వానన్నట్లు, కోటయ్య తన పొట్టను తానే పోషించుకోలేక చచ్చిపోతుంటే, ఈసంతానంకూడ యెక్కువై మరీ అవస్థపడాల్సొస్తుంది. పాపం! ఆపూరిగుడిసె వారందరకు పండుకొనుటకు చాలదు కూడాను. వారు ఆవిధంగానే ఎట్లాగో నానాఅవస్థలు పడుతున్నారు.

కోటయ్య తన పెద్దకొడుకు నలుగుర్ని నలుగు రయ్యల దగ్గర జీతానికి పెట్టాడు. తతిమ్మా నలుగురు పిల్లల్ని, భార్యను పోషించాల్సిన భారం కోటయ్యది. ఒక్కడు యింతమందిని పోషించటం చాలకష్టం. అందువల్ల పాపం! ఆ బీదవాళ్లు ఒకపూటతింటే ఒకపూట పస్తుండి మల మల మాడిపోతున్నారు. కోటయ్య ఆసంవత్సరం కొంచెము జబ్బుపడటం చేత యింట్లో తింటానికి ఒక గింజకూడలేదు. తొమ్మిది మాసములు గర్భిణియైన భార్య పస్తులు మాడటంచూచి కోటయ్య ఓర్చుకోలేక పోయాడు, కాని ఏంచేస్తాడు పాపం! ఆవిధంగా కష్టపడుతున్నారని ఎవరతనికి సహాయం చేస్తారు.

ఆశ్వీజమాసం వచ్చి నాలుగైదు రోజులయింది. ప్రజల వుద్దేశాలకు వ్యతిరేకంగా వర్షాలు కురియనారంభించాయి. యీసంవత్సరం తింటానికి తిండి కూడా దొరకదని అందరు అల్లాడిపోతున్నారు. వర్షాలు జోరు సాగించాయి. రాత్రింబవళ్లు వర్షాలే. ఒకొక్క రోజులో 20 దుక్కులు వర్షంకూడా కురుస్తూంది. ఆ విధంగా నాలుగైదు రోజులు యెడ తెరిపిలేకుండా వర్షాలు కురిశాయి. పైరులన్నీ పూర్తిగా మునిగిపోయా

యి. ఊరికి పడమర ప్రక్కనున్న మురుగు కాలువవచ్చి ఊరుమీదపడింది. ఊరంతా నీటితో నిండిపోయింది. ఊరికి దక్షిణ ప్రక్కనున్న మాలపల్లి అంతా నీటిమట్టం అయిపోయింది. ఆవరదల్లోంచి బయటికిరాలేక కొంతమంది చచ్చిపోయారు కూడాను. అది వర్ణించటానికి మనవశంకాదు. ఆదృశ్యాన్ని చూస్తే ఎటువంటి కఠిన హృదయమైన ద్రవించిపోతుందని మాత్రం నిస్సందేహముగా చెప్పొచ్చు.

ఊరికి పడమరప్రక్క యిదివర కున్నటువంటి పూరిగుడిసె యిప్పుడు కనుపడుటలేదు. అది పడిపోయి నీళ్లల్లో కలిసింది. కోటయ్య మొట్ట మొదటి వాన కురిసిన రోజుననే, ఇక నచ్చటవుంటే లాభంలేదనుకొని భార్యా బిడ్డల్ని తీసుకొని వూళ్లోకి వచ్చేశాడు. ఒక గొడ్ల చావిట్లో ఒకమూల భార్య బిడ్డలతో వుంటున్నాడు. ఇదివరకు కోటయ్య ఇంట్లోవున్నటువంటి కాసినో కూసినో ధాన్యంగాని, సామానుగాని వరదపాలైపోయాయ్. కాబట్టి వారు యీనాలుగురోజుల్నుంచి పస్తే వుంటున్నారు. నిద్రాహారాలులేవు. పెద్ద పెద్ద ఆసాములే ఆవానలకు అలా అల్లాడిపోతుంటే బీదవాడైనటువంటి కోటయ్య స్థితి ఎట్లావుంటుందో చదువరులే ఊహింతురుగాక.

వరదలొచ్చి పదిరోజులయింది. కోటయ్య కాపురమంతా తిండిలేక అల్లాడిపోతున్నారు. పిల్లలు తిండిలేక ఏడుస్తున్నారు. ఆవిధంగా యింకా నాలుగురోజులుంటే పిల్లలుఒక్కళ్లుకూడా బ్రతుకుతారని నమ్మకం లేదు కోటయ్యకు. భార్యఅవస్థలు చూస్తుంటే అతనిగుండె బ్రద్దలైపోతుంది. అప్పుడప్పుడే వరదలు కొద్దిగా తగ్గిపోతున్నాయ్. ఏఅయ్యదగ్గరన్నా ఒక మానెడు బియ్యంతెచ్చి భార్య బిడ్డలకు తిండిపెట్టి బ్రతికిద్దా మనుకున్నాడు. ఊళ్లోకి బయలుదేరాడు. ఎక్కడా మానెడు బియ్యంపుట్టలా. పాపం! ఆదౌర్భాగ్యుడికి ఎవరిస్తారు బియ్యం. తనకొడుకు జీత మున్నటువంటి ఆసామిదగ్గరకుపోయి, 'అయ్యా మీరు మానేడుబియ్యం యిప్పిస్తేనేగాని నాభార్య బిడ్డలు బ్రతికేటట్లు లేరని కాళ్లమీద పడ్డాడు. ఆసామి కాస్త దయార్ద్ర హృదయుడు. కోటయ్యకు ఒక మానెడు బియ్యమిచ్చి పంపాడు. కోటయ్య మహా సంతోషంతో యింటికి చేరుకున్నాడు. ఆరోజు వాళ్లింట్లో పండుగ, పాపం! వాళ్లకు ఏరోజు తిండిదొరికితే ఆరోజే పండుగ.

దీపావళి పండుగ యిక పదిరోజులుంది. ఊళ్లో పిల్లలందరూ దీపావళికి పూలపొట్లాలను కట్టుకుంటున్నారు. అదేదో ఖర్చులేని పని గనుక మన కోటయ్యగారి పిల్లలుకూడ పూలపొట్లాలు కట్టుకుంటున్నారు. నాన్న దీపావళిపండుగ వస్తుంది మాకు టపాకాయలు కావాలి, అవికావాలి యివికావాలి అని తండ్రిని బాధిస్తున్నారు. అభం సుభం తెలియని ఆపసిపిల్లలకు వాళ్లస్థితి ఏంతెలుస్తుంది. కోటయ్య భార్యకూడ, "పండగరోజున పస్తుండకూడదు, ఎచ్చటైనా వడ్లుతీసుకురావలశిందని" భర్త నడిగింది. ధనవంతులకు పండుగగాని మనకెక్కడ పండగే అమ్మీ అని సమాధానం చెప్పాడు. ఈపండక్కే దుర్మార్గుడైన నరకాసురుణ్ణి కృష్ణుడు చంపాడు కాబట్టి మనం సంతోషార్థం టపాకాయలని కాలవాలని భార్యచెప్పింది. కోటయ్య పిల్లలపోరు భార్యపోరు పడలేక ఎలాగో ధాన్యం సంపాదించి పిల్లల్ని భార్యని సంతోష పరుద్దా మనుకున్నాడు.

కోటయ్యకు పండక్కు గింజలు సంపాదించే వుపాయమేమీ కనుపించలా. ఊరికినే ఆసాముల దగ్గరకు పోయి అడిగితే ధాన్యం యివ్వరు కాబట్టి పండక్కి టపాకాయలు కట్టి ధాన్యం సంపాదింపదలచుకున్నాడు. ఊళ్లో పదిమంది ఆసాముల దగ్గరకొచ్చి అడిగి టపాకాయలవీ కట్టిస్తానని పదిమంది దగ్గర పది కాశన్లు వడ్లు పెట్టించుకుని వెళ్లాడు. ఊళ్లో వాళ్ళందరికీ కోటయ్యంటే నమ్మకం. అందువల్ల కోటయ్య తప్పకుండా టపాకాయలు కట్టిస్తాడని వడ్లు చాలమందిచ్చారు. కోటయ్య చాల సంతోష పడ్డాడు:

ఆరోజే దీపావళి. అందరూసంతోషంగా అందరు పిండివంటలవీ చేసుకొని తింటున్నారు. పిల్లలు సంతోషంగా రోకళ్లు కొడుతున్నారు. ఊరంతా చాల ముచ్చటగావుంది. కాసినో కూసినో ధాన్యం వుండబట్టి కోటయ్యగారింట్లో కూడా, ఆవాళ పస్తులేకుండా వంట వండుకుని తింటున్నారు. కోటయ్య అన్నం తిన్న తరువాత టపాకాయలు మొదలైన మందుసామాన్లు కడుతున్నాడు. ఊళ్లోవాళ్లందరు, "కోటయ్య కట్టిన టపాకాయలు బలేగా వున్నాయి, చాల పెద్ద మోత మ్రోగుతున్నాయని" అనుకుంటున్నారు. ఇంతలోనే వూరంతా బ్రద్దలయ్యేటట్లు ఒక ధ్వని విన

బడింది. నిద్రపోయే వాళ్ళంతా ఇదేమిరాయని లేచారు. కోటయ్యగారిల్లు కాలిపోతూంది. ఊరందరూ వచ్చి కోటయ్యగారిల్లు చుట్టూ మూగారు. పాపం! టపాకాయలు కడుతుంటే మందుమండి ఇల్లు తగులబడి వది కాబోలునని అనుకున్నారు. కాసేపట్లోనే మల మల మాడిపోయి నటువంటి కోటయ్యను, అతని భార్యను బిడ్డల్ని చూచారు. ఆదృశ్యం చూస్తుంటే అందరికి ఏడ్పొచ్చింది. పాపం! పాపం! అనుకుంటూ ఎవరిళ్ళకువారు వెళ్లిపోయారు.

ఆరోజు దీపావళినాడు శ్రీకృష్ణుడు భార్యా సమేతుడై క్రూరుడైన నరకాసురుని వధించాడని చెప్తారు. అదెట్లున్నా వుండనీయండి. ఈరోజు దీపావళి మాత్రం కోటయ్యను, తొమ్మిది మాసముల గర్భిణీవతీయైన కోటయ్య భార్యను, ఎనిమిదిమంది పిల్లల్ని భస్మం చేసినట్లు మన కళ్ళకు కనబడుతుంది. ఈదీపావళి రాగానే నాకు ఆదృశ్యం జ్ఞాపకమొస్తుంది, ఒక్కసారి గుండె గభేలుమంటుంది. పాపం! కోటయ్యలాంటి బీదవాళ్లు ఎంతమంది యీవిధంగా మందు సామానులు కడుతూ భస్మమై పోతున్నారోనని దుఃఖిస్తా. ఇకనైన యీపాడుమందు సామానులను కట్టడంగాని, కాల్వటంగాని మానేస్తే ఎంతో బాగుంటుందనుకుంటూ. కోటయ్య జ్ఞాపకార్థం ఆరోజునుంచి మా వూళ్ళో మందుసామానులు కట్టడంగాని, కాల్వడంగాని మానివేశారు.

## కథకులకు మనవి

కథాంజలికి కథలు పంపేవారు రెండు పుటలకు ఎక్కువ లేకుండా వుండేలాగ చూడాలి. కథలుతప్పవ్యాసాలు ప్రకటింపబడవు. కథలు సమాజజీవనానికి సంబంధించినవిగా వుండాలి. సీరియల్ కథలు వేయబడవు. — ఎడిటరు.


# ఆరోగ్యసుధ

సమస్త సెగ సవాయి వ్యాధులకు

20 సంవత్సరములనుండి మా అనుభవములో నున్నది.

సెగవ్యాధులు జీర్ణించుట, సవాయివ్యాధులు జీర్ణించుట, చర్మదోషములు, మూత్ర నాళము నందలిమంట, మూత్రము సన్నముగ వచ్చుట, కీళ్లనొప్పులు, ఉడుకు వ్యాధులు, శుక్లనష్టము మొదలగువానికి దివ్యామృతము. సుమారు 1 నెలకు 1 తులం రు 4.

# స్త్రీసుధ

(స్త్రీల సమస్త వ్యాధులకు) 20 సంవత్సరములనుండి మా అనుభవములో నున్నది.

మైల సరిగ కాకుండుట, బుతుశూల, తెలుపుబట్ట, మైల అధికముగా అగుట మొదలగువానికి 1 నెలకు 1 తులం రు 3.

N. B:— ఇంకను 250 రకముల ఔషధములును, మరికొన్ని అనుభూతమందులును, మాచే రచింపబడిన ప్రసిద్ధములగు ఆయుర్వేద గ్రంథములును మావద్ద దొరకును.

## డాక్టర్. శ్రీపాద కృష్ణమూర్తిశాస్త్రి, బెజవాడ.

మా అనుభూతమందులకును మా గ్రంధములకును ప్రసిద్ధమగు ప్రతిషాపులోను అడుగవలయును.